VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మంగళవారం 19 ఆగష్టు 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 21



2లో

**భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలి:సీఎం**

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# సామాజిక విప్లవానికి తెలంగాణ ఆదర్శం



**సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు**

**బిహార్‌లో బతికే ఉన్న 65 లక్షల మంది ఓట్లు తొలగించారని ధ్వజం**

**రాహుల్‌గాంధీకి ఈసీ నోటీసులివ్వడంపై మండిపాటు**

**బీసీ రిజర్వేషన్లను మోదీ, కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపణ**

## దేశంలో ఎక్కడా లేనివిధంగా కులగణన

## సచివాలయం ఎదురుగా సర్వాయి సర్దార్ పాపన్న విగ్రహం

## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును గవర్నర్ కార్యాలయానికి పంపితే. అక్కణ్నుంచి రాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లింది. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందిస్తే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలవుతుంది. వారే అడ్డుకుంటున్నారు. ఏడేళ్ల క్రితం అప్పటి సీఎం కేసీఆర్ రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ ఆర్డినెన్స్ తీసుకురావడమూ అడ్డంకిగా మారింది.**

హైదరాబాద్:సామాజిక విప్లవానికి దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శమని, సామాజిక న్యాయానికి కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ యావత్ క్యాబినెట్ నిర్ణయాత్మక మార్పులు తీసుకువచ్చిందని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని కుల గణన రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా చేపట్టి బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించి గవర్నర్ కు పంపామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ చర్య దేశంలోనే చర్చకు దారితీసింది, కేంద్రం అనివార్యంగా కులగనన చేపట్టాల్సిన పరిస్థితిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వివరించారు. అనేక అడ్డంకులు ఉన్నప్పటికీ వాటన్నిటినీ అధిగమించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని ప్రతి బహుజనుడు ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క కోరారు.బహుజన బిడ్డలు భవిష్యత్తులో ఫలాలు పొందేందుకు అందరూ సిద్ధంగా ఉండాలి ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకొని కాపాడాలని డిప్యూటీ సీఎం కోరారు. సర్దార్ సర్వాయి పాపన్న పోరాట మార్గం, పోరాట స్ఫూర్తి అందరికీ గుర్తుకు వచ్చే విధంగా సెక్రటేరియట్ ముందు భాగాన విగ్రహం ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సెక్రటేరియట్ ఎదురుగా పాపన్న విగ్రహ ఏర్పాటు-కు స్థలం కేటాయించడం స్ఫూర్తిదాయకం అన్నారు. సామాజిక న్యాయానికి, ధర్మానికి పాపన్న విగ్రహం పునాది అన్నారు.

ఏమీ లేని రోజుల్లోనే పాపన్న అన్ని కులాలను కలుపుకొని అనుకున్నది సాధించారు వారి మార్గంలో

మనందరం అడుగులు వేయాలి అన్నారు. విగ్రహ ఏర్పాటు-, సెక్రటేరియట్ ఎదురుగా స్థలాన్ని ఇచ్చినందుకు సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలపాలి అన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టు-బడి పని చేసింది కొన్ని రాజకీయ పార్టీలు రకరకాలుగా ప్రచారం చేస్తున్నాయి, వారికి స్పష్టంగా సందేశం ఇవ్వడం కోసం నిలబడిన ప్రజా ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గుండెల్లో పెట్టు-కొని కాపాడాలి అన్నారు.



2లో..

# వేగంగా దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి

**నెక్స్ట్ జరేషన్ రిఫార్మ్స్‌పై మోడీ దృష్టి**

**అత్యవసరంగా పలువురు మంత్రులతో సమావేశం**

**ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించిన మోడీ**



2లో..

**జలకళను సంతరించుకున్న జలాశయాలు కాళేశ్వరం అవసరం లేదని గుర్తు చేసిన ప్రభుత్వం**

## నిండుకుండల్లా ప్రాజెక్టులు



# భారీ వర్షాలతో

## పొంగిపొర్లుతున్న వాగులు,వంకలు

- నిండుకుండలా శ్రీరామ్‌సాగర్ జలాశయం ..గేట్లు ఎత్తివేత
- మహారాష్ట్రలో జగిత్యాల వాసుల గల్లంతు
- ములుగు ఏజెన్సీలో భారీ వర్షాలు..నిండిన లక్నవరం చెరువు
- అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క హెచ్చరిక
- వనదుర్గామాత ఆలయం చుట్టూ మంజీరా ప్రవాహం



హైదరాబాద్: భారీ వర్షాలతకు తోడు ఎగవ నుంచి వస్తున్న వరదతో నిజామబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో 8 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091 అడుగులు కాగా.. ప్రస్తుతం 1088 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 72.23 టీ-ఎంసీలుగా నమోదైంది. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ఇదిలావుంటే మహారాష్ట్రలోని ఉద్గిర్ వద్ద జగిత్యాల జిల్లా వాసులు గల్లంతయ్యారు. వీరు మహారాష్ట్రకు వెళ్లి తిరిగివస్తుండగా.. కారు వరద నీటిలో కొట్టుకుపోయింది. ఈ ఘటనలో నలుగురు గల్లంతవగా.. ఓ బాలుడి ఆచూకీ లభ్యమైంది. మిగతా వారికోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. బాధితులను హసీనా, సమీనా, ఆఫ్రీన్‌గా గుర్తించారు. ములుగు జిల్లాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఏజెన్సీ మండలాలు వెంకటాపురం, వాజేడు, మంగపేట, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, తాడ్వాయిలో ఎడతెరిపి లేకుండా వాన దంచికొడుతోంది. కుండపోత వర్షంతో రోడ్లపై వరద పెద్ద ఎత్తున ప్రవహిస్తోంది. మంగపేటలో 19 సెంటీ-మీటర్ల వర్షపాతం నమోదైంది.పలు కాలనీలు,ఇళ్లలోకి వరద నీరు చేరింది. వెంకటాపురం శివాలయం వీధిలో రోడ్లు జలమయమయ్యాయి. మంగపేటలో పంట పొలాలు నీట మునిగాయి. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు.

# కూకట్‌పల్లిలో దారుణ హత్య

## ఒంటరి బాలికను హత్య చేసిన దుండుగుల



హైదరాబాద్: కూకట్‌పల్లిలో ఘోరం జరిగింది. పన్నెండేళ్ల బాలికను అత్యంత కిరాతకంగా హత్య చేశారు. బాలిక తల్లిదండ్రులు ఆఫీస్‌లకు వెళ్లిన సమయంలో ఒంటరిగా ఉన్న కూతుర్ని అత్యంత పాశవికంగా చంపేసి పరారయ్యారు దుండగులు. కూకట్‌పల్లి సంగీత్ నగర్‌లో ఈ దారుణం జరిగింది. పేరెంట్స్ ఇంట్లో లేని సమయంలో పన్నెండేళ్ల సహస్రాణి ను పొట్టనబెట్టుకున్నారు. హత్య గురించి తెలుసుకున్న స్థానికులు ఘటనా స్థలానికి భారీగా చేరుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటీ-న చేరుకున్నారు. పోలీసులు చెబుతున్న వివరాల ప్రకారం.. సహస్ర తల్లిదండ్రులు రేణుక, కృష్ణ ప్రైవేట్ ఉద్యోగులు. కొన్నాళ్లుగా కూకట్‌పల్లిలో నివసిస్తున్నారు. బాలిక తల్లిదండ్రులు ఉద్యోగ నిమిత్తం ఆఫీస్‌కు వెళ్లిన సమయంలో ఈ హత్య జరిగిందని తెలిపారు. చిన్నారి మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విగతజీవిగా ఉన్న తమ చిన్నారిని చూసి గుండెలవిసేలా రోధిస్తున్నారు.

# రామంతాపూర్ సందర్శించిన విదుత్యశాఖ సిఎండి

**కేబుల్ వైర్ల వల్లే ప్రమాదం జరిగినట్లు అంచనా ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ**



హైదరాబాద్: రామంతాపూర్ విద్యుత్ షాక్ ఘటనపై విద్యుత్ శాఖ సీఎండీ ముషారఫ్ స్పందించారు. రామంతాపూర్ ఘటన బాధాకరం..కేబుల్ వైర్ల వల్లే ఈ ఘటన జరిగిందని ప్రాథమిక అంచనాకు వచ్చాం. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం..డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కతో చర్చించి మృతులకు, గాయాలైన వారికి నష్టపరిహారం విషయంపై చర్చిస్తాం అన్నారు. ఘటనాస్థలిని ఆయన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. రామంతాపూర్ విద్యుత్ షాక్ తర్వాత..ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన సీఎండీని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది..తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడినుంచి కదిలేది లేదని పట్టు-బట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సోమవారం తెల్లవారు జామున జరిగిన శ్రీ కృష్ణాష్టమిసందర్భంగా గోఖలేనగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. రథానికి కట్టినజీపు పాడవడంతో స్థానికులు, భక్తులు రథాన్ని లాగుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో యాత్ర సాగుతుండగా చాలా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు ఒక్కసారిగా శోభాయాత్ర రథానికి తాగడంతో విద్యుత్ షాక్ తగిలింది. రామంతాపూర్ లో ఉద్రిక్తత నెలకొంది.. రామంతాపూర్ విద్యుత్ షాక్ ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు వచ్చిన విద్యుత్ శాఖ సీఎండీని స్థానికులు అడ్డుకున్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడినుంచి కదిలేది లేదని పట్టుబట్టారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గోఖలే నగర్ లో గత కొంతకాలంగా విద్యుత్ సమస్యలు ఉన్నాయని, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. సోమవారం తెల్లవారు జామున జరిగిన శ్రీ కృష్ణాష్టమిసందర్భంగా గోఖలేనగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. రథానికి కట్టినజీపు పాడవడంతో స్థానికులు, భక్తులు రథాన్ని లాగుతూ ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో యాత్ర సాగుతుండగా చాలా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు ఒక్కసారిగా శోభాయాత్ర రథానికి తాగడంతో రథంపై ఉన్న దాదాపు డజన్ మందికి విద్యుత్ షాక్ తగిలింది. స్పాట్ లో ఐదుగురు మృతిచెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందారు.

వేగుచుక్క

# వేగంగా దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి



న్యూఢిల్లీ: వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భాగంగా ఇండియా నెక్స్ జనరేషన్ రిఫామ్స్‌కు సంబంధించిన రోడ్‌మ్యాప్‌పై చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో జరిగిన ఈ సమావేశంలో హోం మంత్రి అమిత్‌షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ మంత్రి నితిన్ గడ్కరి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయెల్ తదితరులు పాల్గొన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం ఇవ్వడం, మౌలిక వసతులను మెరుగుపరచడం, గవర్నన్స్ పటిష్టత దిశగా వ్యూహాత్మక విధానాల రూపకల్పను ఉద్దేశించి ఈ సమావేశం నిర్వహించారు. ఈజీ ఆఫ్ లివింగ్, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సర్వతోముఖాభివృద్ధి దిశగా వివిధ రంగాల్లో వేగవంతమైన సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరాన్ని మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధాని మోదీ వివరాలు వెల్లడించారు. నెక్స్ట్ జనరేషన్ రిఫామ్స్ కోసం రోడ్‌మ్యాప్ తెచ్చేందుకు జరిపిన సమావేశానికి అధ్యక్షత వహించానని, అన్నిరంగాల్లోనూ వేగవంతమైన సంస్కరణలు తాము కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి భారత్‌లో రెండ్రోజుల అధికార పర్యటనలో భాగంగా భారత్ చేరుకున్న నేపథ్యంలో మోదీ సమావేశం ప్రాధాన్యత సంచరిచుకుంది. అమెరికాతో వాణిజ్య సంబధాల్లో అనిశ్చితి, బీజింగ్, మాస్కోలతో వాణిజ్య సంబంధాలు పెంచుకునేందురు భారత్ ప్రయత్నిస్తున్న క్రమంలో కూడా ఈ సమావేశానికి ప్రాధాన్యతం ఏర్పడింది.

**ప్రధాని మోడీతో శుభాంశు శుక్లా భేటీ**

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం యాత్రను పూర్తి చేసుకుని స్వదేశానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ- అయ్యారు. ఈ సందర్భంగా శుభాంశు తన రోదసి ప్రయాణ విశేషాలను ప్రధాని తో పంచుకున్నారు. యాత్ర విజయవంతంపై మోదీ ఆయన్ను అభినందించారు. శుభాంశు శుక్లాతో సంభాషణ గొప్పగా సాగింది. అంతరిక్షంలో ఆయన అనుభవాలు, శాస్త్రసాంకేతిక రంగాల్లో పురోగతి, భారత్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'గగన్‌యాన్' మిషన్ సహా అనేక అంశాలపై చర్చించాం. రోదసిలో శుభాంశు సాధించిన ఘనత పట్ల యావత్ దేశం గర్విస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా జూన్ 25 నుంచి జులై 15 వరకు శుభాంశు శుక్లా తన బృందంతో కలిసి 'ఐఎస్‌ఎస్' యాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. దీని కోసం శిక్షణ పొందుతూ ఏడాదిగా ఆయన అమెరికాలో ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున భారత్‌కు తిరిగొచ్చారు. శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతంపై లోక్‌సభలో ప్రత్యేకంగా చర్చించారు.

**ప్రధాని మోడీతో రాధాకృష్ణన్ భేటీ**

న్యూఢిల్లీ: మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సోమవారంనాడు కలుసుకున్నారు. ఎన్డీయే సమావేశాల్లో పాల్గొనేందుకు, పలువురు నేతలను కలుసుకునేందుకు రాధాకృష్ణన్ ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోడీని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఆయనకు నా అభినందనలు తెలియజేశాను. సుదీర్ఘ ప్రజా సేవ, అనుభవంతో ఆయన దేశ కీర్తిని పెంచారు. అదే అంకితభావంతో దేశానికి సేవలు కొనసాగించాలని కోరుకుంటున్నాను అని మోడీ ట్వీట్ చేశారు.

**మోడీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్**

ట్రంప్‌తో చర్చల వివరాలు పంచుకున్న అధ్యక్షుడు

న్యూఢిల్లీ: అనూహ్యంగా మరోమారు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రధాని మోడీతో ఫోన్‌లో మాట్లాడారు. ట్రంప్‌తో చర్చల వివరాలను చర్చించారు. సోమవారం పుతిన్ మోడీకి ఫోన్ చేసి మాట్లాడడం విశేషం. రష్యా అధ్యక్షుడు పుతిన్డు ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. ఉక్రెయిన్ యుద్ధం ముగింపు ప్రయత్నాల్లో భాగంగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అలాస్కా వేదికగా జరిగిన సమావేశానికి సంబంధించిన వివరాలను పంచుకున్నారు. ప్రధాని మోదీ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

డొనాల్డ్ ట్రంప్ తో అలాస్కా భేటీ-కి సంబంధించిన వివరాలను పంచుకున్నందుకు పుతిన్‌కు ధన్యవాదాలు. ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగానే పరిష్కరించుకోవాలని భారత్ మొదటినుంచి పిలుపునిస్తోంది. ఈ విషయంలో అన్ని ప్రయత్నాలకు మద్దతు ఇస్తాం అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ప్రధాని మోదీ, పుతిన్‌లు మాట్లాడుకోవడం పది రోజుల్లో ఇది రెండోసారి. ఈ నెల 8న కూడా ఇరునేతలు ఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను మోదీకి పుతిన్ వివరించినట్లు- తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు పీఎంవో వెల్లడించింది.

## భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలి: సీఎం

హైదరాబాద్: భారతీయ సినిమా నిర్మాణానికి కేంద్రంగా హైదరాబాద్‌ను నిలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 71వ జాతీయ ఫిల్మ్ అవార్డులకు ఎంపికైన సినీ ప్రముఖులు సోమవారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భగవంత్ కేసరి సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి, హనుమాన్ సినిమా దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ నిర్వాహకులు వెంకట్, శ్రీనివాస్, బృంద సభ్యులు, ఫైట్ మాస్టర్లు నందు, పృథ్వీ, బేబి సినిమా దర్శకుడు సాయి రాజేశ్, సింగర్ రోహిత్‌లను సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ సినిమా నిర్మాతలు చైతన్యరెడ్డి, నిరంజన్‌రెడ్డి, బేబి సినిమా నిర్మాత ఎస్‌కేఎన్, భగవంత్ కేసరి నిర్మాత గారపాటి సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినిమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పలువురు సీఎం దృష్టికి తీసుకెళ్లగా..సినిమా రంగ ప్రోత్సాహానికి అవసరమైన చేయూతనందిస్తామని సీఎం పేర్కొన్నారు.

# నిండుకుండల్లా ప్రాజెక్టులు

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అవసరం లేదని మరోమారు ప్రభుత్వం తెలిపింది. ఇదో నిరర్థక ప్రాజెక్ట్ అని పరోక్షంగా తెలియచేసింది. ఇందులో నీళ్లు లేకున్నా.. మేడిగడ్డ ఆనకట్ట కుంగినా, అన్నారం, సుందిళ్లలో నీటిని ఆపకున్నా వర్షాలతో గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ జలకళ సంతరించు కున్నాయని తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు వివిధ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిండటంతో ఉత్తర తెలంగాణలో వరద కాల్వలతోపాటు- మిడ్ మానేరు, ఎల్‌ఎండీలో క్రమంగా నీటి నిల్వలు పెరుగు తున్నాయని తెలిపింది. మహారాష్ట్ర, ఎగువన గోదావరి పరివాహకంలో కురిసిన వర్షాలతో ఎస్సారెస్పీకి మూడు రోజులుగా ఇన్ ఫ్లో కొనసాగుతోంది. సోమవారం మధ్యాహ్నం లక్షా 25వేల క్యూసెక్కులకు పైగా ఇన్ ఫ్లో ఉండగా.. ఔట్ ఎ÷-లో 76,867 క్యూసెక్కులకు పైగా ఉంది. కాకతీయ కాల్వకు 5,000 క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 18 వేల క్యూసెక్కుల నీటిని ఇందిరమ్మ వరద కాల్వ ద్వారా మిడ్ మానేరుకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వ 18.92 టీ-ఎంసీలకు చేరుకొంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ సామర్థం 20.175 టీ-ఎంసీలు. ఎల్లంపల్లి గరిష్ట నీటిమట్టం 148 మీటర్లు కాగా.. ప్రస్తుతం 147.55 మీటర్ల వద్ద నీటిమట్టం ఉంది. ఎస్సారెస్పీ పరివాహకంలో కురిసిన వర్షాలతో 48,293 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో ఉంది. ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ తాగునీటితో పాటు- ఎన్టీపీసీకి నీటిని విడుదల చేస్తున్నారు. నంది పంప్ హౌస్‌కు 6,300 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆగస్ట్ 13 నుంచి అయిదు రోజులుగా ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరుకు 4.12 టీ-ఎంసీల నీటిని వదిలారు. మిడ్ మానేరు జలాశయంలో 10.81 టీ-ఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుత నీటి మట్టం 309.63 మీటర్లు ఉండగా.. అది 311.14 మీటర్లకు చేరితే నీటినిల్వ 13.13 టీ-ఎంసీలకు చేరుతుంది. అప్పుడు ఒక పంప్ ఆన్ చేయటం వీలవుతుందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం ఉన్న ఇన్ ఫ్లో ప్రకారం ఆగస్ట్ 20వ తేదీ నుంచి పంపింగ్ ప్రారంభించే అవకాశాలున్నాయని నీటిపారుదలశాఖ ఇంజినీర్లు తెలిపారు. మిడ్ మానేరు నుంచి నాలుగు పంపులు రన్ చేయాలంటే నీటినిల్వ 25.77 టీఎంసీలకు చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొత్తంగా కాళేశ్వరం లేకున్నా యధావిధిగా నీటి ప్రాజెక్టుల్లో నీరు ఉందని తెలిపింది. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తున్న వేళ ప్రభుత్వ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# రాధాకృష్ణన్‌కు లోకేశ్ అభినందనలు

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న లోకేశ్.. కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా ఎంపీలతో కలిసి ఆయన్ను కలిశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైనందుకు రాధాకృష్ణన్‌కు లోకేశ్ అభినందనలు తెలిపారు. ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్ పేరు ఖరారైన నేపథ్యంలో ఆయన గురించి వార్తలు గూగుల్ ట్రెండ్స్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి.



# తలకోనలో శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం

**శంకుస్థాపన చేసిన టిటిడి చైర్మన్**

తిరుపతి: జిల్లాలోని తలకోనలో శ్రీసిద్ధేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు భూమిపూజ చేశారు.

అంతకుముందు ఆయన బాలాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం ఆలయం, నూతన పుష్కరిణి నిర్మాణానికి చైర్మన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతవరణంలో కొలువైన సిద్ధేశ్వరాలయ జీర్ణోద్ధరణ చేపట్టమన్నారు. ఆలయం శిథిలావస్థలో ఉన్నట్లు- చంద్రగిరి ఎమ్మెల్యే నాని టిటిడి దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు.



# మాజీ మంత్రి సబితాకి షాక్ ఇచ్చిన హైకోర్టు..



తెలంగాణ: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి తెలంగాణ హైకోర్టు షాక్ ఇచ్చింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నోటీస్ జారీ చేసింది. అప్పుడు గనుశాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డితో పాటు.. పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంకు కూడా నోటీసులు వచ్చాయి. వీరు ఈ కేసులో A8, A9 నిందితులుగా ఉన్నారు. వీరిద్దరిని నిర్దోషులుగా ప్రకటిస్తూ మే 6వ తేదీన నాంపల్లి సీబీఐ కోర్టు తీర్పు ఇవ్వగా.. దీనిని సవాల్ చేస్తూ సీబీఐ.. హైకోర్టులో అప్పీలు చేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి , మాజీ ఐఏఎస్ అధికారి కృపానందంలను నిర్దోషులుగా ప్రకటిస్తూ మే నెలలో నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పుపై సీబీఐ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. ఈ కేసులో వీరిద్దరికి శిక్ష విధించాలని సీబీఐ తన పిటిషన్‌లో కోరింది. ఆసక్తికరంగా.. ఈ కేసు విచారణ నుంచి జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి తప్పుకున్నారు. గతంలో నిందితుల్లో ఒకరి తరఫున తాను వాదనలు వినిపించినందున ఈ కేసును విచారించలేనని ఆయన తెలిపారు. ఇప్పుడు మరో న్యాయమూర్తి ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించారు.

**మంత్రిగా అనుమతులు..**

అంతరగంగమ్మ కొండల్లో మైనింగ్ లీజులు కట్టబెట్టడంలో సబితా ఇంద్రారెడ్డి, కృపానందంల పాత్ర ఉందని సీబీఐ తన అప్పీలులో పేర్కొంది. వీరు కీలక పాత్ర పోషించడం వల్లే ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) అక్రమంగా 29.32 లక్షల టన్నుల ఖనిజాన్ని తరలించిందని సీబీఐ ఆరోపించింది. కృపానందం 2005 నవంబర్‌లో ఓఎంసీకి తాత్కాలిక లీజు మంజూరు చేశారని.. దీనికి అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి ఆమోదం తెలిపారని వివరించింది. కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి అనిల్ సుబ్రమణియన్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్దోషులుగా ప్రకటించిందని సీబీఐ వాదించింది.

**బెయిల్‌పై గాలి జనార్ధన్ రెడ్డి..**

సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు సబితా ఇంద్రారెడ్డి, కృపానందానికి కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీ ఖాన్, వీడీ రాజగోపాల్లకు ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానాను నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో విధించింది. అయితే.. తాజాగా గాలి జనార్ధన్ రెడ్డితో పాటు మిగతా నలుగురు దోషులకు తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మరిన్ని విచారణలు, కోర్టులో జరిగే వాదనలు కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయి.

## జైలు నుంచి విడుదలైన 24 గంటల్లోనే చోరీ

హైదరాబాద్: చిక్కడపల్లిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వివేక్ నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో దొంగతనం చేసిన కర్ణాటకకు చెందిన బ్రూస్లీ, ఖమ్మం జిల్లాకు చెందిన సాయికుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 28 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై గతంలో అనేక కేసులు నమోదయ్యాయి. జైలు నుంచి విడుదలైన 24 గంటల్లోనే బ్రూస్లీ ఈ చోరీకి పాల్పడ్డాడు.

హైదరాబాద్ చిక్కడపల్లిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. వివేక్ నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయణ ఇంట్లో ఈ నెల 15న జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి 28 తులాల బంగారు ఆభరణాలు, రూ. 25,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి ఈ వివరాలను వెల్లడించారు. నారాయణ ఇంట్లో దాదాపు 30 తులాల బంగారం, కొంత నగదు అపహరణకు గురికావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన క్రైమ్, టాస్క్ ఫోర్స్ బృందాలు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి, నిందితులను గుర్తించాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు కర్ణాటకకు చెందిన బ్రూస్లీ, మరో నిందితుడు ఖమ్మం జిల్లాకు చెందిన సాయి కుమార్ అని పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు బ్రూస్లీ ఈ నెల 13న మరో చోరీ కేసులో చర్లపల్లి జైలు నుంచి బెయిల్‌పై విడుదల య్యాడు. అదే జైలులో సాయికుమార్‌తో పరిచయం ఏర్పడింది. నిందితులిద్దరిపై గతంలో అనేక పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. బ్రూస్లీపై 67, సాయికుమార్‌పై 63 కేసులు ఉన్నాయని, వీరిద్దరిపై గతంలో పీడీ యాక్ట్ కూడా నమోదైందని డీసీపీ తెలిపారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాలను డీసీపీ శిల్పవల్లి అభినందించారు.

## మీరు 'రియల్ సూపర్ స్టార్' రజిని గారు...

తెలంగాణ: ప్రముఖ నటుడు రజినీకాంత్ తన 50 ఏళ్ల సినీ జీవితంలో ఒక్క వాణిజ్య ప్రకటనలోనూ నటించకపోవడం గొప్ప విషయమని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కొనియాడారు. డబ్బు కోసం తప్పుడు ప్రకటనలు చేసే సెలబ్రెటీలకు భిన్నంగా, రజినీకాంత్ తన అభిమానుల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు ఉచితంగా సహకారం అందిస్తున్న రజినీకాంత్ నిజమైన సూపర్ స్టార్ అని సజ్జనార్ ప్రశంసించారు.

చాలా మంది హీరోలు, సెలబ్రెటీలు కాసుల కోసం కకుర్తి పడి తప్పుడు వాణిజ్య ప్రకటనల్లో నటిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే సిగరెట్లు, పాన్ మసాలాలు వంటి వాటితో పాటు బెట్టింగ్ యాప్స్ కూడా ప్రమోట్ చేస్తున్నారు. ప్రజలు ఎటుపోతే మాకేంటి డబ్బులే ప్రధానం అన్నట్లుగా యాడ్స్ చేస్తున్నారు. అయితే, ఈ విషయంలో సూపర్ స్టార్ రజినీకాంత్ ఒక ప్రత్యేకమైన పంథాను అనుసరిస్తున్నారు. రజినీకాంత్ తన కెరీర్‌లో ఇప్పటివరకు ఒక్క కమర్షియల్ యాడ్‌లో కూడా నటించలేదు. ఎన్ని కోట్లు ఇస్తామని చెప్పినా, ఆయన వాటిని సున్నితంగా తిరస్కరిస్తారు. ఆయన తిరస్కరణకు కారణం, తన అభిమానులపై ఆయనకు ఉన్న గౌరవం, బాధ్యత. 'నేను ఏదైనా ప్రకటనలో నటిస్తే, నా అభిమానులు దానిని గుడ్డిగా నమ్మేస్తారు. ఆ ప్రకటనలో ఏదైనా లోటుపాట్లు ఉంటే, దానికి నేను బాధ్యుడిని అవుతాను. అందువల్ల ఆ సంపాదన నాకు వద్దు' అని ఆయన తరచూ చెబుతుంటారు. కనీసం ఆయన ముఖాన్ని ఉపయోగించుకోవడానికి కూడా ఆయన అనుమతించరు.

వాణిజ్య ప్రకటనలకు దూరంగా ఉన్నప్పటికీ, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలకు రజినీకాంత్ తన సహకారాన్ని ఉచితంగా అందించారు. 1980లలో తమిళనాడు ప్రభుత్వం ప్రారంభించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన పైసా తీసుకోకుండా ప్రచారం చేశారు.

వేగుచుక్క



# ఉద్యోగం కాదు "వ్యవస్థాపకత" కోసం కృషి చేయాలి.

## విద్యార్థులకు జెఎన్టియు విసి డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి పిలుపు.

## బిటెక్‌లో నూతన విద్యార్థులు కోసం ఘనంగా "ఓరియంటేషన్ డే".















**వేగుచుక్క న్యూస్, హైదరాబాద్, ఆగస్టు 18:**

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుత పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, ఉద్యోగ అన్వేషణ కంటే వ్యవస్థాపకత కోసం విద్యార్థులు కృషి చేయాలని జెఎన్టియు వైస్ చాన్సలర్ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు."యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ, (జెఎన్టియు హైదరాబాద్) బిటెక్ లో నూతన విద్యార్థులు కోసం సోమవారం ఘనంగా "ఓరియంటేషన్ డే" కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ జీవి. నరసింహ రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో నెలకొన్న సామాజిక సమస్యలను పరిష్కరించడానికి డిమాండ్ ఆధారిత పరిశోధనలు నిర్వహించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఫ్రెషర్లు యూనివర్సిటీ లో ప్రవేశం పొందడంలో సహాయపడే అవిశ్రాంత కృషికి అభినందనలు తెలిపారు. విద్యార్థులు కాన్సెప్ట్‌లు, లాబొరేటరీ లెర్నింగ్, ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు మరియు టెక్నికల్ రైటింగ్‌లకు బలమైన విధానాన్ని కలిగి ఉన్న కొత్త అభ్యాస నమూనాకు అనుగుణంగా ఉండాలని అన్నారు. అంతకుముందు సీఆర్సీ చైర్‌పర్సన్ డాక్టర్ వి. పార్వతి క్యాంపస్‌లోని వివిధ కోర్సులలో చేరిన ఫ్రెషర్స్‌ను స్వాగతించారు. యూనివర్సిటీ కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రఘురామ్ విద్యార్థులకు విద్యా నిబంధనల గురించి వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవి. నరసింహ రెడ్డి మాట్లాడుతూ, ఫ్యాకల్టీ మరియు విభాగాలు, సౌకర్యాలు, మౌలిక సదుపాయాల గురించి వివరించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు వివిధ అకడమిక్ క్లబ్‌ల సభ్యులను పరిచయం చేశారు. గౌరవ అతిథిగా హాజరైన జెఎన్టియు రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ, విద్యార్థులను యూనివర్శిటీలోకి అడుగుపెట్టడాన్ని స్వాగతించారు. ఇది 'అభ్యాస దేవాలయం'గా నిలిచిందనీ, విద్యార్థులు సౌకర్యాలను ఉపయోగించుకోవాలని అన్నారు. అధ్యాపక సభ్యుల నైపుణ్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన జెఎన్టియు రెక్టర్ డాక్టర్ కె. విజయ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఫ్రెషర్లు తమ అభ్యాసం మరియు అసైన్‌మెంట్‌ల పట్ల ఆరోగ్యకరమైన ఉత్సుకతను పెంపొందించుకోవాలని ప్రోత్సహించారు. ఆరోగ్యకరమైన విద్యా వాతావరణాన్ని కొనసాగించాలని ఆయన విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు సైతం విద్యార్థుల పురోగతినీ నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఓరియంటేషన్ ప్రోగ్రామ్ - 2025 విజయవంతంగా నిర్వహించినందుకు ఇన్స్టిట్యూట్ యొక్క సీనియర్ విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.





# త్వరలో ఆఫ్రికాకు రాజమౌళి అక్కడే కీలక సన్నివేశాల చిత్రీకరణ

మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాపై ఆసక్తికరమైన అప్‌డేట్స్ వచ్చాయి. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా రాజమౌళి స్వయంగా ఈ సినిమా గురించి కొన్ని విషయాలు వెల్లడించారు. కేవలం కొన్ని ప్రెస్ మీట్‌లు లేదా అప్‌డేట్స్ ద్వారా సినిమా కథాంశాన్ని పూర్తిగా వివరించలేమని రాజమౌళి స్పష్టం చేశారు. సినిమా గురించి అప్పటికప్పుడు ఏది అప్‌డేట్ ఇవ్వాలో అదే ఇస్తామని తెలిపారు.



దక్షిణాఫ్రికాలో ఇటీవల జరిగిన అల్లర్ల కారణంగా అక్కడ ప్లాన్ చేసిన షూటింగ్ వాయిదా పడింది. సెప్టెంబర్ రెండో వారంలో సౌత్ ఆఫ్రికాలో షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ ఆలస్యం కావడంతో, ఈ మధ్య హైదరాబాద్‌లోనే హీరోయిన్‌తో కొన్ని కీలక సన్నివేశాలను షూట్ చేశారు. ప్రస్తుతం షూటింగ్స్ నిలిచిపోయిన నేపథ్యంలో సౌత్ ఆఫ్రికా షెడ్యూల్ కోసం బిజీగా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో మునిగి పోయారు రాజమౌళి. ఈ క్రమంలో బాడీ ట్రాన్స్ఫర్మేషన్ మీద మహేష్ ఫోకస్ పెట్టాడు. ఈ సినిమా మహేష్ బాబు కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోతుందని, రాజమౌళి స్థాయికి తగ్గట్టుగా భారీ బడ్జెట్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కుతుందని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాలో మహేష్ బాబుతో పాటు- పృథ్వీ రాజ్ సుకుమారన్ తో పాటు- ప్రియాంక చోప్రా కీలక పాత్రలలో నటిస్తున్నారు.

# రామయణంలో నాది హనుమత్ పాత్ర చిలిపిగా, అల్లరిగా ఉంటుందన్న సన్నీ డియోల్



బాలీవుడ్ నుంచి మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లలో ఒకటి 'రామాయణ' దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రం 45కి పైగా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించబోతుండగా.. సాయిపల్లవి సీత పాత్రలో నటిస్తుంది. రావణుడిగా కన్నడ స్టార్ హీరో యష్. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే తదితరులు నటించబోతున్నారు. అయితే ఈ సినిమాలో తన పాత్రకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు నటుడు సన్నీడియోల్. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్ర పోషిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ రోల్ చాలా సరదాగా అల్లరిగా ఉండడంతో పాటు- ఉత్సహాంగా ఉంటుందని సన్నీ తెలిపాడు. నా పాత్రకు సంబంధించి త్వరలోనే షూటింగ్ ప్రారంభంకానుంది. ఇలాంటి పాత్రలు చాలా సవాలుతో కూడుకున్నవని అందులో పూర్తిగా లీనమై నటించాలని సన్నీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ అనుభూతిని పంచడానికి చిత్రబృందం నిరంతరం శ్రమిస్తోందని ఆయన తెలిపారు. హాలీవుడ్ సినిమాల స్థాయికి ఏమాత్రం తగ్గకుండా ఈ సినిమాను రూపొందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని ఎన్నిసార్లు తెరకెక్కించినా కొత్తగానే ఉంటుందని, ఈ సినిమాతో ప్రపంచమంతా రామాయణం గొప్పతనాన్ని మరోసారి తెలుసుకుంటుందని సన్నీ డియోల్ ధీమా వ్యక్తం చేశారు.

# బర్త్‌డేకు విశ్వంభర టీజర్ విడుదల... ఆసక్తితో అభిమానులు



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో విశ్వంభర భారీ బడ్జెట్ తో వస్తోంది. వశిష్ట డైరెక్షన్ లో వస్తున్న ఈ సినిమాను సోషియో ఫాంటసీ థ్రిల్లర్ గా తీసుకొస్తున్నారు. జెట్ స్పీడ్ తో షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే రిలీజ్ కాబోతున్న ఈ సినిమా నుంచి భారీ అప్డేట్ రాబోతోంది. మూవీ టీజర్ ను ఇప్పటికే కట్ చేసినట్టు- తెలుస్తోంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేస్తున్నట్టు- తెలుస్తోంది. త్వరలోనే రిలీజ్ డేట్ ను ప్రకటించబోతున్నారు. ఇప్పటికే ఆర్ ఆర్ కూడా కంప్లీట్ అయిపోయిందంట. గతంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్ పై కొన్ని విమర్శలు వచ్చాయి. వీఎఫ్ ఎక్స్ వీక్ గా ఉందనే ప్రచారం జరిగింది. అందుకే ఈసారి ఎలాంటి విమర్శలకు తావు లేకుండా చూస్తున్నారంట.

వశిష్ట అన్నిరకాల జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే మెగా ఫ్యాన్స్ మెచ్చే విధంగా టీజర్‌ను కట్ చేయించినట్టు తెలుస్తోంది. చిరంజీవి కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో వస్తున్న ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. త్రిష, అషికా రంగనాథ్ హీరోయిన్లుగా చేస్తున్నారు. కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత కాలం నాటికి వెళ్లే సీన్స్ కూడా ఉంటయాంటున్నారు. వింటేజ్ చిరు లుక్ గురించి ఇప్పటికే చర్చ జరుగుతోంది. కాబట్టి చిరంజీవి లుక్ ఈ సినిమాలో మరింత ఇం-టె-స్ట్ ను పెంచే అవకాశాలు ఉన్నాయి. ఈ టీజర్ తో మెగా ఫ్యాన్స్ ను సంతృప్తి పరిచేసి మూవీపై భారీగా అంచనాలు పెంచాలని చూస్తున్నారు. సెప్టెంబర్ లోనే మూవీ రిలీజ్ అవుతుందనే టాక్ మొన్నటి వరకు నడిచింది. కానీ ఇప్పుడు అక్టోబర్ కు షిఫ్ట్ అయిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

# త్వరలోనే కొత్త సినిమా

చిరంజీవి, వెంకటేష్, బాలకృష్ణ సరికొత్త రికార్డులు సృష్టిస్తుంటే.. కింగ్ నాగార్జున మాత్రం గట్టి కంబ్యాక్ కోసం కష్టపడుతున్నారు. 2022లో వచ్చిన బంగార్రాజు తర్వాత నాగ్ పెద్దగా హిట్ చూడలేదు. బ్రహ్మాస్త్ర హిట్ అయినప్పటికీ అది రణబీర్, అమితాబ్ బచ్చన్ ఖాతాలోకి చేరిపోయింది. ఆ తర్వాత వచ్చిన ది గోస్ట్ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా.. నా సామి రంగా పర్లేదనిపరచింది. కింగ్ హీరోగా కాస్త బ్రేక్ ఇచ్చి.. సపోర్టింగ్ అండ్ స్పెషల్ రోల్స్‌కు షిఫ్టయ్యారు.



నాగార్జున ఇటీ-వలే ధనుష్ 'కుబేర'తో ప్రేక్షకుల్ని అలరించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఈ సినిమాలో నాగ్ విలన్‌గా నటించారు. అయితే కింగ్ కొత్త సినిమా విషయంలో మాత్రం క్లారిటీ- రావడం లేదు. కానీ ఇప్పటికే నాగ్ కొత్త సినిమాపై గట్టిగా కసరత్తులు చేస్తున్నారు. ఈసారి ఆయన తమిళ దర్శకుడితో మైల్‌స్టోన్ మూవీ చేయబోతు న్నట్టు-గా తెలుస్తోంది. 'రా.కార్తీక్' దర్శకత్వంలో నాగార్జున సినిమా చేయబో తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను 'కింగ్ 100' వర్కింగ్ -టైటిల్‌తో మొదలు పెట్టబోతున్నారు. తాజా అప్డేట్ ప్రకారం.. ఈ చిత్రాన్ని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 29న ప్రకటించనున్నట్లు సమాచారం. దీనికోసం ఇప్పటికే ఓ లుక్‌ను కూడా సిద్ధం చేసినట్లు- తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోను ప్రారంభించి 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను నాగ్ తమ సంస్థలోనే స్వయంగా నిర్మించనున్నారట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటు-న్న ఈ సినిమా షూటింగ్ త్వరలోనే మొదలుకానుందని సమాచారం.

# క్షమించండి...



నటి బిపాసా బసుపై మృణాల్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడంతో ఆమె క్షమాపణలు కోరారు. పాత ఇంటర్వ్యూలో బిపాసాను కండలు తిరిగిన మగవాడిలా ఉందంటూ చేసిన కామెంట్స్‌పై మృణాల్ స్పందిస్తూ, తాను టీనేజ్‌లో తెలివితక్కువగా మాట్లాడినందుకు చింతిస్తున్నానని తెలిపారు. బాడీ షేమింగ్ ఉద్దేశం తనకు లేదని, అందం అన్ని రూపాల్లో ఉంటుందని ఆమె పేర్కొన్నారు. బిపాసా కూడా పరోక్షంగా స్పందిస్తూ మహిళలు దృఢంగా ఉండాలని కౌంటర్ ఇచ్చారు.

మృణాల్ ఠాకూర్ పాత వీడియో ఒకటి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. అందులో నటి బిపాసా బసును ఉద్దేశించి ఆమె షాకింగ్ కామెంట్స్ చేశారు. బిపాసా కండలు తిరిగిన మగవాడిలా ఉంటుందంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారడంతో, నెట్టింట మృణాల్ ను విపరీతంగా ట్రోల్ చేశారు. దీనిపై ఎట్టకేలకు మృణాల్ స్పందించారు. క్షమాపణలు చెబుతూ ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ పెట్టారు. "నేను 19 ఏళ్ల టీనేజర్‌గా ఉన్నప్పుడు చాలా తెలివితక్కువ మాటలు మాట్లాడాను. సరదాగా అన్న మాటలు ఇప్పుడు ఇంతమందిని బాధపెడతాయనేది నాకు ఎప్పుడూ అర్థం కాలేదు. జరిగిన దానికి నేను తీవ్రంగా చింతిస్తున్నాను. క్షమించండి. ఎవరినీ బాడీ షేమింగ్ చేయాలనేది నా ఉద్దేశ్యం కాదు. ఇంటర్వ్యూలో సరదాగా మాట్లాడిన మాటలు ఇంత దూరం వెళ్తాయని తెలియదు. నేను అలా మాట్లాడకుండా ఉండాల్సిందని ఇప్పుడు అనుకుంటున్నాను. కాలక్రమేణా, అందం అన్ని రూపాల్లో వస్తుందని నేను అర్థం చేసుకున్నాను. అది నిజంగా ఎంతో విలువైనది" అని మృణాల్ ఠాకూర్ పేర్కొన్నారు. మృణాల్ ఠాకూర్ కెరీర్ ప్రారంభంలో ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. బిపాసా బసు కంటే తాను చాలా అందంగా ఉంటానని పేర్కొన్నారు. బిపాసా కండలు తిరిగిన పురుషుడిలా కనిపిస్తారని, అలాంటి అమ్మాయిలను ఎవరైనా పెళ్లి చేసుకోవాలని అనుకుంటారా అన్నారు. ఆమెతో పోలిస్తే తాను బెటర్ గా ఉన్నానని కామెంట్ చేశారు. ఆ వీడియో ఇప్పుడు వైరల్ కావడంతో పలువురు బాలీవుడ్ సెలబ్రిటీలు, బిపాసా అభిమానులు మృణాల్ మాటలను తప్పుబడుతూ పోస్టులు పెట్టారు.

మృణాల్ వీడియోపై బిపాసా బసు కూడా పరోక్షంగా స్పందించారు. స్త్రీలు బలంగా దృఢంగా ఉండాలని, మహిళలు కండలు పెంచాలని పోస్ట్ పెట్టారు. కండలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంచడానికి హెల్ప్ అవుతాయన్నారు. అమ్మాయిలు శారీరకంగా బలంగా కనిపించ కూడదనే పాతకాలపు ఆలోచనల నుంచి బయటకు రావాలంటూ మృణాల్‌కు కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలోనే మృణాల్ ఠాకూర్ క్షమాపణలు చెబుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

# పూజాను వెంటాడుతున్న బ్యాడ్‌లక్



ఒకప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలిగిన పూజా హెగ్డే, ప్రస్తుతం సరైన హిట్ కోసం కష్టాలు పడుతున్నారు. 'అల వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆమె నటించిన చాలా సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయాయి. దీంతో ఆమెకు బ్యాడ్ లక్ వెంటాడుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి.అల వైకుంఠపురములో' తర్వాత పూజా నటించిన సినిమాలు వరుసగా నిరాశ పరిచాయి. అఖిల్‌తో చేసిన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', ప్రభాస్‌తో చేసిన 'రాధే శ్యామ్', విజయ్‌తో చేసిన 'బీస్ట్', రామ్ చరణ్‌తో చేసిన 'ఆచార్య' సినిమాలు బాక్సాఫీస్ వద్ద చతికిలపడ్డాయి. తెలుగులోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా ఆమెకు కలిసి రాలేదు. 'సర్కస్' , దేవా, 'కిసీ కా భాయ్ కిసీ కా జాన్' చిత్రాలు కూడా విమర్శకుల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రతికూల స్పందన పొందాయి. అంతేకాకుండా, తమిళ నటుడు సూర్యతో చేసిన 'రెట్రో' కూడా నిరాశనే మిగిల్చింది. తాజాగా, ఆమె స్పెషల్ సాంగ్ చేసిన 'కూలీ' చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఈ సినిమాలో 'మోనికా' పాటలో ఆమె డ్యాన్స్ అందరినీ మెప్పించినప్పటికీ, సినిమాలో ఆ పాట ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడంతో ప్రేక్షకులు నిరాశపడ్డారు. దీనిపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ కూడా జరిగింది. ఈ వరుస పరాజయాలు పూజా హెగ్డే కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తిరిగి ఫామ్‌లోకి రావడానికి ఆమెకు ఒక పెద్ద హిట్ ఎంత అవసరమో ఈ పరాజయాలు స్పష్టం చేస్తున్నాయి. ఆమె చేతిలో విజయ్ జన నాయగన్ సినిమా ఒక్కటే ఉంది. మరి భవిష్యత్తులో ఆమె లక్ ఎలా ఉంటుందో చూడాలి.

# 'అమ్మ' తొలి మహిళా ప్రెసిడెంట్‌గా



సినీ పరిశ్రమ అంటేనే మగాధిపత్యంగా భావిస్తారు. ఇక్కడ ఎవరు ఎదగాలన్నా.. పాతాళానికి తొక్కేయాలన్నా మగాళ్లదే నిర్ణయమని అంటుంటారు. ఇలాంటి ఇండస్ట్రీలో మహిళల పరిస్థితిపై ఎంతోమంది తమ గళాన్ని విప్పుతూనే ఉంటారు. సినిమాల్లో ఛాన్సులు కావాలంటే కమిట్‌మెంట్లు ఇవ్వాల్సిందేనని, అందుకు ఒప్పుకోకపోతే ఇండస్ట్రీకే దూరం కావాల్సి వస్తుందని గతంలో చాలామంది హీరోయిన్లు సైతం బహిరంగ కామెంట్లు చేసిన ఘటనలు ఉన్నాయి. అలాంటి పరిస్థితులున్న సినీ ఇండస్ట్రీలో ఓ మూవీ అసోసియేషన్‌కి మహిళ అధ్యక్షురాలిగా ఎన్నికైందంటే నమ్మగలమా.. పైగా లైంగిక ఆరోపణలతో పరువు పోగొట్టుకున్న అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అధ్యక్షురాలిగా ఓ మహిళ ఎన్నిక అయ్యారంటే నమ్మడం మరీ కష్టం. కానీ ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించింది బోల్డ్ బ్యూటీ శ్వేతా మీనన్ మూడు దశ్శాబ్దాల 'అమ్మ' చరిత్రలో ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తొలి నటిగా రికార్డు క్రియేట్ చేశారామె.

ఉత్కంఠభరితంగా సాగిన 'అమ్మ' ప్రెసిడెంట్ ఎన్నికల్లో తన ప్రత్యర్థి దేవన్‌పై శ్వేతా మీనన్ ఘన విజయం సాధించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొచ్చిలో ఓటింగ్ జరగ్గా ఫలితాలను సాయంత్రమే వెల్లడించారు. ఈ అసోసియేషన్‌లో 506 మంది సభ్యులకు ఓటు హక్కు ఉండగా 298 మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. కొందరు ప్రముఖ నటులు ఈ ఓటింగ్‌కి దూరంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో శ్వేతా మీనన్ గెలిచారని ప్రకటించగానే అక్కడ హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దీంతో 'అమ్మ' ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తొలి నటిగా ఆమె రికార్డు నెలకొల్పారు. 'అమ్మ'కు వైస్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీ ప్రియ, జాయింట్ సెక్రటరీగా కుక్కు పరమేశ్వరన్, జనరల్ సెక్రటరీగా అన్సిబా హాసన్ ఎన్నికయ్యారు.

మలయాళ సినీ ఇండస్ట్రీపై గతంలో ఎన్నో ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోను మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసేందుకు కేరళ ప్రభుత్వం 2019లో జస్టిస్ హేమ నేతృత్వంలో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. అయితే ఈ కమిటీ పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంచలన నివేదిక తయారుచేసింది. మలయాళ ఇండస్ట్రీలో మహిళలు కాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. సినిమా పనులు మొదలుకాక ముందే లైంగిక వేధింపులకు పాల్పడుతు న్నట్లు అనేక మంది బాధితులు ఆరోపించి నట్లు వెల్లడించింది. దీంతో 'అమ్మ' అధ్యక్షుడిగా ఉన్న మోహన్‌లాల్‌తో పాటు కార్యవర్గం అంతా మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే 2027లో జరగాల్సిన ఎన్నికలు ఇప్పుడే నిర్వహించారు.

వివాదాస్పదన నటిగా గుర్తింపు పొందిన ఆమె గెలుస్తుందని ఎవరూ అనుకోలేదు. పైగా ఎన్నికలకు కొద్దిరోజుల ముందే ఆమెపై పోలీస్ కేస్ నమోదైంది. అయితే అన్ని అవరోధాలు దాటుకుని 'అమ్మ'కు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఆమె గెలవడం ఓ చరిత్రగానే చెబుతున్నారు. ఎంజీ సోమన్, మోహన్‌లాల్, మమ్ముట్టి వంటి అగ్ర హీరోలు అధ్యక్షులుగా పనిచేసిన 'అమ్మ'కు ఇప్పుడు ఓ నటి ప్రెసిడెంట్ కావడంతో మలయాళ ఇండస్ట్రీలో చాలా మార్పులు చోటుచేసుకునే అవకాశాలున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.